చిలక — గోరింక

అమ్మ వాళ్ళింటికి వెళ్ళిపోయిందని నేనడిగినదానికి జవాబుచెబుతూ మొహంతుడుచుకుందికి తువ్వాలు తెచ్చి అందించుతూ అంది కమల. తుడుచుకున్నతర్వాత అనేక వూహాలు బుర్రలోకి రాగా ఆలోచిస్తూ 'యింకా ఆలస్యం ఎందుకు? రా! రావూ!' అన్నట్లు కమలవైపు చూశానుకాని, ఒక్కమారు వీధిగుమ్మంవైపు కళ్ళు చక్రాల్లా తిప్పి తల వంచుకుంది. ఆ భావం గ్రహించినట్టు గభాలున వీధితలుపు వెయ్యడానికని వీధిలోకి వెళ్ళేను.

"ఏమే కమలా! ఏంచేస్తున్నావు?" అని పరామర్శిస్తూ వచ్చేస్తూంది రాక్షసిలాగ ప్రక్కయింటి సుబ్బమ్మగారు—ఏదో పెద్దపనివున్నట్టు! వచ్చి రావడంతోనే మంచంమీద సావకాశంగా చతికిలబడింది. నాకు ఒళ్ళంతా మండిపోయింది. గుడ్లగూబలా సమంగా ఎటువంటి సమయానికి వచ్చింది! అప్పుడు నాకెంతకోపం వచ్చిందంటే నిర్మొహమాటంగా 'వెళ్ళిపో, మాఅమ్మ యింట్లోలేదు' అని ఖచ్చితంగా చెప్పేద్దామనుకున్నానన్నమాట. కాని, ముందు రాబోయేది కొంచెం ఆలోచించి నోరుమూసుకొని వూరుకున్నాను. ఇహ నెందుకూ అక్కడుండడం! ఆ భ్రభ్రాజీమానంముఖం చూడ్డానికా? అదీకాక అక్కడింకా వున్నానూ అంటే నోరు మంచిది కాదు. ఒకదాని కొకటి ఏ మొస్తుందో అని చల్లగా వీధిగది

లోకి వచ్చి మీద మేఘాలు లెక్క పెడుతూ ఆలోచిస్తూన్నాను. ఆవిడని చూడగానే నిరాశపడిపోయి కూర్చుండిపోయేము.

ఇలా యిదొక్క మారేనా? అయ్యో అదేం ఖర్మమో, బుద్ధి పుట్టించిన ఆ భగవంతుడు అది నెరవేరేటట్టు కూడా చెయ్యడు! చూడడు!! ఒకదఫా యిలాగే—

నాకు పెళ్ళయిన తర్వాత మా యింటికి కమల రావడం అదే తొలిసారి. ఆ బుద్ధి యింతకుముందెప్పుడూ పుట్టలేదు గాని, అదేఁవిటోగాని అప్పుడు కమలని చూసిన దగ్గర నుండి అదోలా అనిపిస్తూంది! అప్పట్లో నా అలికిడి అయేసరికి తుర్రుమని పారిపోయేది. ఆ పారిపోతున్నప్పుడు వదిలిన బాణం లాగు తృటిలో కనిపించి అవుపించేది కాదు! ఆలీల చూసే "ఓహో! హో!" అని అనుకొనేవాడిని. అటువంటి పరిస్థితుల్లో ఆమెతో మాట్లాడడంకూడానా? ఇప్పటికే లెఖ్ఖకు దాటి పోలేదు! నక్షత్రాలు అలా మిడుతూ మిడుతూ చంద్రుణ్ణి చూసి, చూస్తూ ఆనందించడమేగాని స్వతంత్రించి కౌగలించుకోగలవా? చీకటిరాత్రుల్లో చంద్రుడు అన్ని నక్షత్రాల్లోనూ అన్నిభాగాలుగా లీనమయిపోతాడు కామోసు! లేకపోతే చంద్రుడు లేకపోయినా అవి ఎందుకలా మెరుస్తూంటాయి?

కొన్నాళ్ళకి ఎలాగైతేనేం మామధ్య మన్మథుడు ప్రవేశించి అటునుంచి యిటూ, యిటునుంచి అటూ కొన్ని గులాబీపువ్వుల బాణాలూ, మరి కొన్ని మల్లెపువ్వులవి, యింకా కొన్ని సంపెంగపువ్వులవి, యిలా విలువైన బాణాలే

పదలడం మొదలెట్టేడు. నాపక్కనుండి వెళ్ళినవి చామంతి, సన్నజాజి, బాణాలైతే ఆమెనుండి వచ్చినవి దవనం, మరువం బాణాలు.

ఒకనాడు మాఅమ్మ ఏదో పనివుండి ఎవరింటికో వెళ్ళవలసివచ్చింది. మరెవ్వరూలేరు. నేనూ, కమలా ఒంటరిగా యిద్దరం తటస్థపడడం అదే మొట్టమొదటి పర్యాయం. ఆ సమయంలో నాకు మతి స్థిమితంగాలేదు. ఏంచెయ్యడానికీ తోచలేదు. నాసర్వస్వం- ఎక్కడో మందరపర్వతమథన ప్రదేశంలో దేవతలు అమృతాన్ని దొంగతనంగా తాగుతున్నట్టు అనిపించింది. అక్కడ నాకప్పుడు విషజ్వాలలు కనబడలేదు. అమృతధారల్లో స్నానంచేస్తున్నా నంతే! కల్పవృక్షంకింద కూర్చున్నా. చంద్రుడువచ్చి కాస్తవెన్నెలని కామధేను పాలతో కలిపియిచ్చేడు. తాగేసి జిర్రుని తేన్చేను. లక్ష్మీదేవి విష్ణుమూర్తికోసం కాబోలు వెతుక్కుంటూంది!

అలా కమలవైపు చూస్తూ కూర్చున్నాను. కమల పెరట్లో కాఫీ కలుపుతున్నాది. స్వంతపెళ్ళాందగ్గర అంతజడుపు దేనికో నాకే బోధపడిందికాదు. ఎంత గుత్తయినా కొత్త కదూ? అందుకే తటపటాయించి ఆలోచించవలసి వచ్చింది. అప్పుడు నాస్థితి ఎలావుందో వర్ణించలేను. అఖరికి తెగించేశాను.

మెల్లిగా పెరట్లోకి వెళ్ళేను. నన్నుచూసి-ఆ చుట్టుపక్కల దోబూచులాడేచోట్లు లేవుకాబట్టి-అలాగేలేచి గోడకి ఆనుకొని నిలుచుంది నా కమల. వీధితలుపు తాళపుచెవి కన్నంలోంచి చూస్తే కనబడకుండా యీ పెరటితలుపు చేర

వేశాను. కమల అది చూసిందోలేదో ఏంమాటాడలేదు. నేను చొరవ చేసి ఆమె చెయ్యి పట్టుకున్నాను! కొంచెం బెట్టు సరిచేస్తున్నట్టు ఆ చెయ్యి బరువుగానే వచ్చింది. నాకూ కొత్త! ఆమె చెయ్యి కొంచెం వణికింది. వణకడమో మరేవిటోగాని నాకు మాత్రం ఎలక్ట్రిక్ కరంటు షాక్‌లాగ లాగింది! జల్లు మంది. సరి! వీధితలుపు చప్పుడూ, దానితో సహా 'ఏవండీ!' అన్న పిలుపూను. ఇహ నెలా ఊరెట్టుకోవడం? వెన్నెలరాత్రి వస్తూందీ అన్న ముందురోజుల్లో రాలిపోయిన 'తార'లా అయింది. ఆమె చెయ్యి గభాలున లాగేసుకుంది! నేను ఆ తొందరలో కాఫీ గిన్నెని తన్నేసి గదిలోకి ఒక్క దాటు వేసేను!

కమల తలుపు తీసింది. వచ్చింది ఎవరు? ఆ వీధిలోనే వున్న మరొక అమ్మాయి.ఎందుకు వచ్చిందీ అంటే-, జాకెట్టు కత్తిరింపులూ, కుట్టడం నేర్చుకుందికి! పాపం! మా అమ్మ కూడా వుంటుంది కదా అని వచ్చింది. వచ్చి నన్నూ, దాన్ని ఒంటరిగా చూసి— వాసన పసిగట్టి, కొంచెం విచక్షణాజ్ఞానం, పాపం, పుణ్యాం ఎరిగున్నది కాబోలును- "మీ అత్తగారు లేరూ! మళ్ళీవస్తాను!" అని లేవబోయింది! కాని కమల వెళ్ళ నివ్వలేదు! నాకున్న తొందర యీామెకు లేదేం చెప్మా! ఏ వయసులో వున్నా వాళ్ల మనస్తత్వాం, వాళ్ళ భావాలూ, అభిప్రాయాలూ, అదే వయసులోవున్న పైవాళ్ళకు కూడా సులభంగా అర్థమవుతాయి. సమాన వయస్కులు ఒకళ్ళ నొకళ్ళు అర్థం చేసుకున్నట్టు భిన్నమయినవారు చేసుకోలేరు. స్నేహాం విషయంలో కూడా, పిల్లలు, పిల్లలతోనే— యువ

కులు యువకులతోనే, పెద్దలు పెద్దలతోనే, వృద్ధులు వృద్ధులతోనే ఎక్కువగా స్నేహంగా వుండడం చూస్తాము గాని, భిన్న వయస్కుల మధ్య స్నేహం తరచు పొసగదు. పొసిగినా నిత్యం కాదు. మరి యీ అమ్మాయికీ, ఆ సుబ్బమ్మకీ భేదం యిదే!

మొత్తంమీద యీ పుణ్యకాలంకూడా యిలా చెడింది. ఇలా ఏదో మంచి సమయం దొరకడం, తీరా ఏ పాపపు గ్రహాలో వచ్చి పాడుచెయ్యడం! లేకపోతే యిప్పుడేం కొంప మునిగిపోయింది. ఆ సుబ్బమ్మ వాళ్ళమీద వీళ్ళమీద ఆడిపోసుకుంటూ తా చెడ్డకోతి వనమెల్లా చెరిచిందన్నట్లు పై వాళ్ళనికూడా పాడుచెయ్యడానికి వచ్చి కూర్చోకపోతే! సమంగా ఎరిగున్నట్లు వస్తారు మంచి రిహార్సలు వేళకి! మొహంముందు ఠకీమని చెప్పేయడానికి దమ్ము చాలదు! అలా చెబితే యింకేమయినా వుందా? ప్రసార ప్రవాహాలు బయలుదేరవూ? అంతే! అలా లోలోపునే పొంగే కోరికలని బలవంతాన్ని అణచుకుంటూ ఏడవవలసిందే!

వివాహం శుభముహూర్తాన్ని ఎలాగూ చేశారు! యిహను అదొక్కటే తరువాయి! దానికయినా నేను 'ఊఁ' అంటే అభ్యంతరముండేది కాదుగాని, "చదువైతేనేగాని" అన్నఅడ్డు నా అంతట నేనే వెర్రివెధవలా పెట్టుకొని పెక్కు చేశాను. ఇప్పుడది కాదని ఎలా యీ విషయం చెప్పడం? మరో ఉపాయం ఆలోచించాలి! అదీ అపాయంలేని ఉపాయం అయితే ఉభయత్రా మంచిది. యింతకీ అధికారం ఉన్నచోట అపాయం వచ్చినా ఫర్వాలేదు! ఏది ఏమయినప్పటికీ. ఈ

కలాపాన్ని పూర్వాంనించీ కవులు— ఒక్క— కవులేమిటి అనుభవ యోగ్యులందరూ ఎంతలాగో వర్ణిస్తారు. వర్ణిస్తూ నిమీలిత నేత్రులౌతారు. అవుతూ పరవశత్వం పొందుతారు. పొందుతూ వేడి వేడి నిట్టూర్పులు విడుస్తూంటారు. ఏమో తాము చూసింది స్వర్గలోకమని మననీ చూడమంటారు ! తినబోయేది రుచిచూస్తేనేగాని తృప్తిలేనట్టు అదేవిటో యీ లోగానే అనుభవిద్దామంటే— విస్తట్లో బొట్లులాగ సమయం దొరికేటప్పటికి వీళ్ళొకళ్ళు తగులుకుంటున్నారు, మాటి మాటికీ !

ఇలా ఆలోచిస్తూంటే కమలసంగతి అప్పటి పరిస్థితి జ్ఞాపకం వచ్చింది. ఆ సుబ్బమ్మ ఎప్పటికయినా పైకి వస్తుందేమో అని కూర్చుంటే అప్పుడనగా వెళ్ళిన మనిషి ఓ ఘంట అయిందిగాని యింకా ఊడిరాలేదు. చిక్కిన సమయం అలా వృధాపోతూంటే నాకెంతో యిది అనిపించింది. పిల్లి పారపోసిన పాల లాగయింది. ఆ పాలు పిల్లికీ దక్కవు, మనకూ దక్కవు! మెల్లిగా తలుపు తోసి చూసాను... యింకేముంది! ఆవిడ హాయిగా నిద్రపోతూంది! దీని నిద్ర తగలడా, పోయి వాళ్ళింట్లో ఏడవరాదూ? కమల అల్లుకుంటూ ఆ ప్రక్కనే కూర్చుంది. చూసీ చూడనట్టు యిటువయిపు చూస్తూంది. నాకు భరించలేనంత కోపం వచ్చింది. అసలు ఆవిడ వుద్దేశ్యం ఏమిటి? ప్రత్యేకంగా పడుక్కుందికి యిక్కడకే రావాలా? ఏదో సామెత చెప్పినట్టు— మా యింట్లోవాళ్ళే చూసీ చూడనట్టు వదిలేస్తూంటే మధ్య యీ పైవాళ్ళ బాధ ఏమిటి? అయినా ఆవిడ బుర్రలో ఆపాటి జ్ఞానం వుండొద్దూ—

ఎవరూ లేరు పాపం ఏదో అవస్థపడుతున్నారనేనా ఆలోచించ నక్కరలేదా? యీ రకం మనుష్యులకి ఎడబాటు కలిగించడం అంటే ఆనందమేమో! తలుపు గడియ చప్పుడు చేసేటప్పటికి కమల ఇటువయిపు చూసింది. "దాన్నెలాగయినా దారిబట్టి తోవచూడు" అన్నట్టు నేను సంజ్ఞ చేశాను. ఒకమారు నవ్వి వూరుకుంది. అదేం తత్వమో, మరి!

ఆ సుబ్బమ్మ రాకనే పోవాలిగాని వచ్చిందంటే మూడు నాలుగు ఘంటలయితేనేగాని వెళ్ళదు. అంతవరకూ ఎవరికీ ఎందుకూ పనికిరాని బాతాఖానీ కొడుతుంది. అన్నిటికీ ఊఁ! కొట్టివేస్తేనే సరిగాని, లేకపోతే ఎలాగోలాగ ఒప్పించే వరకూ వదలదు. ఇంతలో—

"అబ్బబ్బ! తాళాలు వేసుకు వెళ్ళిపోతుంది, వూరు మీదకి తిరగడానికి! కొంపలో మరెవరూ లేరనుకుంది కామోసు. ఎలా చావమంటుందో యివతల వాళ్ళని" అని అంటూ సుబ్బమ్మగారి ఆడబొట్టి గబగబా వచ్చింది.

"సుబ్బమ్మ వుందిరా?" అని మహా చనవుగా అడిగింది. ఆమెని చూడగానే ప్రాణం స్థాయిలోకి వచ్చి కుదుటబడింది. నాపాలిటి భాగ్యదేవతలాగ ఆ ఒక్క నిమిషం కనిపించింది.

"ఆహా! వున్నాది! కాస్త పట్టు ఎక్కువయింది. కాబోలు! హాయిగా చీకూ చింతా లేకండా నిద్రపోతూంది! అయినా తాళాలు దగ్గరుంచుకోని చెప్పకుండా చెయ్యకుండా సత్రపు భోజనం మఠం నిద్రా అన్నట్టు ఎక్కడో పడుక్కుందికి పోతే ఎలాగవుతుంది? పనులవొద్దూ? వెళ్ళి లేపండి. మరి

యింట్లో నాలుగు పనులూచూసుకోకపోతే అన్నీ మీరొకరు చూసుకోగలరా!" అని ఏదో అభిమానం వున్నట్లు చెప్పేను. ఆ తర్వాత ఆవిడ ధర్మమా అంటూ ఆమె వెనకాలే సుబ్బమ్మగారు కూడ ఆవలించుగుంటూ, ఒళ్లు విరుచుకుంటూ వెళ్ళిపోయింది.

కమల ఒక్కర్తె వున్నట్టే. వీధిలో ఎవరి దృష్టీపడకండా చూసుకొని గబుక్కుని లోపలికి పోయి తలుపు వేశాను. అదేమోకాని కొంచెం కాళ్ళు చేతులూ వొణికేయి, కమల నన్ను చూసి పల్లెవాటు సర్దుకుంది. లేచి పక్కకి తిరిగి నిలుచుంది. దగ్గరగా నే వెళ్లేనుగాని ఏమనాలో తెలియక తబ్బిబ్బు పడ్డాను! కొంచెం మరుగ్గా వుంటే ఎందుకయినా మంచిదని, అక్కడయినా ధైర్యం వస్తుందేమోనని మాటాడకండా నట్టింటిలోకి వెళ్ళి నిలుచున్నాను. ఆమెకోసం ఎదురు చూశాను. నా తెలివితక్కువగాని ఆడపిల్లలంత వేగిరం కలుగజేసు కుంటారా! ఎంతకీ రాలేదు కమల. అంత ఆతృతలో, నిరీక్షణలో నిరాశ పుట్టగానే విసుగెత్త నారంభించింది. తెగించి పిలుద్దామని యివతల చూశాను. కమల ఎక్కడా కనుపించలేదు. ఇందాక నిలబడ్డచోటుకూడా ఖాళీగా వుంది. వాకిట్లో సూర్యకాంతంపువ్వులు తమవద్దకి రాకండా మీదమీదనే ఎగురుతూన్న తుమ్మెదవైపు జాలిగా చూస్తూ, అది ఎటు తిరుగుతే యివీ అటే వంగుతూ, రమ్మని పిలుస్తున్నట్టున్నాయి.

గదిలో గాజుల చప్పుడు అయింది. అదొక సందేశం. ఇసంతా సిగ్గే కామోసు అనుకొని గదిలోకే వెళ్లిచూశాను.

తలుపు ప్రక్కనే సిగ్గుతో గోడకి తల ఆనించి నిలుచుని సన్న సన్నంగా, దొంగ దొంగగా చూస్తోంది తలుపు సందులోంచి.

'కమలా !' అని పిల్చాను. ఒక్కమారు అదోలా చూసి ప్రక్కకి తిరిగిపోయింది. చెయ్యి మెల్లిగా పట్టుకొని దగ్గరికి తీసుకున్నాను. అప్పుడు సరస్వతి ధ్వనించే వీణ చేత్తో తాకుతు న్నట్టయింది. వెంటనే ఆమె చెయ్యివిదుల్చుకుంటూ" వద్దు, ఎవరయినా వస్తారు!" అని అన్నప్పుడు అతీతమయిన ధ్వనులూ, అపూర్వమయిన స్వరాలూ, ఆనందమయిన రాగములూ కూర్చి వీణమీద అలా, అలా వినిపించినట్టయింది. నేనా పరవ శత్వంలోనే పూర్తిగా వశంచేసుకుందికి ప్రయత్నిస్తూ-

'గడియ వేసే వచ్చానులే!' అని అన్నాను. ఆమెను దగ్గరగా తీసుకోబోయేను. తలుపు చప్పుడయింది.

కమల బెదిరిపోయింది. ప్రశ్నార్థకంగా భయంతో చూసి విడిపించుకు పారిపోయింది. మెట్టుమెట్టుకీ విఘ్నాలే నురా భగవంతుడా! అనుకున్నాను. ఎవరయినా లోపలికివస్తే వాళ్ళని అలా వెళ్ళనిచ్చి చడీచప్పుడూ లేకండా తప్పుకో వచ్చునని, ధాన్యం బస్తాల వెనక కుక్కిన పేనులా కూర్చున్నాను. మరొక అవకాశమూ, వుపాయమూ, గత్యంతరమూ లేక, అవస్థకొద్దీ విధిలేక దొంగతనానికి నెట్టుకోవలసివస్తుంది. మళ్ళీ సుబ్బమ్మగాని వచ్చిందంటే సాయంత్రం మాఅమ్మ వచ్చేవరకూ కదలదు. అక్కడ నుండి దాటిపోడానికి వీలుండదు. మాఅమ్మ అనుమానిస్తుంది. ఏమనుకుంటుందో! లేకపోతే మాఅమ్మే వచ్చేసిందా ! ఏంవిటి చాటుమాటుగా ఏంచేసినా ఫర్వాలేదుగాని ఒక్కసారి అను

మానానికి అవకాశం యిచ్చేమూ అంటే మరి యీ స్వతంత్రమూ వుండదు. ఒక కన్ను యిటు పారేసి ఖాయిదాకొస్తే యిలా సమయం లభ్యంకాదు! ఏందారి? యిలా ఆలోచిస్తూంటే బస్తాలన్నీ ఒక్కమారుగా నామీద తిరగబడ్డట్టు అయింది. కమల తొట్రుపాటులో తల, పరికిణీ, పల్లెవాటూ, అన్నీ సర్దుకొని తలుపుతీసింది. ఆ తర్వాత ఎవరితోనో మాటాడుతున్నట్టు వినిపించింది. నే ననుకున్నవారెవరూ కాదని ఆ వాతావరణం బట్టి నిర్ధారణచేసికొని స్థిమిత పడ్డాను. మరో పదినిమిషాలకి తలుపువేసి కమల వస్తూంది. గదిలోకి రాలేదు! నేనే లేచి వెళ్ళి చూశాను. ఆమె నవ్వుతున్నట్టుంది.

“ఎవరు?” అని అడిగాడు.

“ప్రక్క యింటి నారాయణమ్మగారు ఆవాలు బదులిమ్మని వచ్చింది” అని చెప్పింది. అప్పటికి నాగుండెల్లో గాభరా తగ్గింది. కమలని గదిలోకి తీసుకువచ్చేను. నాతో మరొక మహత్తరమైన శక్తివచ్చి కలుస్తున్నట్టయింది గాని. వేరొక మనిషి నన్నంటిపెట్టుకున్నట్టు లేదు. దోసిట్లో పుష్పంలాగ మృదువుగా ముడుచుకుపోయింది సిగ్గుతో. ‘కమలా’ అని సంబోధించేను. వంచిన తల మీది కెత్తుతూ.

—ఏం జవాబు చెప్పలేదు. కిందకి చూస్తుండడంవల్ల కనుబొమ్మలూ, రెప్పలూ మాత్రం కనబడుతున్నాయి. ఆ కనుబొమ్మలు రెండూ ఎక్కుబెట్టిన వింటిబద్దలలాగూ, కంటిరెప్పలు రెండూ నారిలాగూ అవుపిస్తున్నాయి.

“నే జ్ఞాపకం వున్నానా?” అని అడిగేను.

......చిన్ననవ్వు నవ్వింది అంతే.

"నాదగ్గర యింత సిగ్గెందుకూ?" అనగానే ఆమె మరీ సిగ్గుపడిపోయింది.

"అయితే మాటాడవన్నమాట!" అన్న పిమ్మట–

"ఏఁవిటి మాటాడేది?" అని పెదిమలు కదిలేయూ లేదా అన్నట్టు, కొత్తగా మాటలు నేర్చిన రాఁవచిలకలా అంది.

"నీ కిష్టమయింది" అని నేచోయస్ యిచ్చేను.

"అడగండి."

"బాగుంది నీ కే దిష్టమో నాకెలా తెలుస్తుంది?"

"మీ కేది యిష్టమైతే అదే నాకూయిష్టం" అన్నది నవ్వుతూ. అక్కడికి బిడియం కొంతవరకు సడలింది.

"అయితే మనం చిన్నపుడేంచేశామో చెప్పు" అని అడిగేను.

"నాకు తెలీదు. మీరేచెప్పండి."

"ఏం జ్ఞాపకంలేవా?"

"అన్నిటిమాటా ఏమోగాని, అవి మరిచిపోతాను."

అంటూ నా చిటికినవ్రేలు పట్టుకుంది. అప్పటి చేష్టలింకా జ్ఞాపకం వున్నాయన్నట్టు నిదర్శనంగా, చిన్నతనంలో యింకా పెళ్ళికాకముందు, మాయిద్దరిని మొగుడూ పెళ్ళాలని అందరూ ఆడించడం, ఎవరూ చూడకండా మేం నవ్వుకుంటూండడం, యివన్నీ జ్ఞాపకానికి వచ్చేయి.

"ఇంకా ఏంచేశాం" అని తిరిగి అడిగేను.

"మరేం చెయ్యలేదు, నాకు తెలీదు" అంది.

"పోనీ నువ్వు మీవూళ్ళో నన్నెన్నడైనా తలుచుకుంటావా?" అని అడిగేను.

"ఉఁహు... మీరో" అంది.

"నన్ను చూస్తే తెలియడంలేదూ!"

"మరి నేనలా అవుపించడం లేదేఁవిటి?" అని నవ్వుతూ అంది.

"నిన్ను చూస్తే నీవిషయం తెలుస్తూందిగాని, నన్ను తలచుకుంటే ఎలా వుంటుందో చెప్పు" అని అడగ్గానే వేళ్ళతో జుత్తు తఃశివి ఏదో భావంచెప్పినట్టు చూసింది.

"నాకెలా వుంటుందో నీకూ అలాగే అనేనా! అంతేనా?" అని అన్నాను ఆమె అలాగే చెబుతుందని తెలిసి.

"ఉహుఁ కాదు! మీకెలాగో వుందని నాకు తెలుసు."

"అదేఁవిటి అలా అంటున్నావు?"

"ఏమో మీకేవిఁటి నేను కాకపోతే మరొకరు!"

"అలాగా—మరి నీకుమాత్రం మరొకరు దొరకరా ఏమిటి?" అని నేననగా ఆమె చేత్తో నానోరుమూసింది.

"ఏం, నేను పెళ్ళాడక పోతేనేం—"

ఏం మాటాడలేదుగాని ఒక నిట్టూర్పు మాత్రం విడిచింది.

"ఏం?" అని మళ్ళీ అడిగేను.

"అబ్బె ఏఁవీలేదు—నాకేం?" అని అందికాని, మనసులో వున్నది వేరు.

"పెళ్ళి అయిపోయింది కాబట్టిగాని లేకపోతే యేం చేద్దువు ?"

"ఎందుకవదు?"

"ఎంత నమ్మకం! యేమో యెవరు చెప్పగలరు? నువ్వు నాకోసమే అని భగవంతుడు దస్తావేజు రాసిచ్చేడా?"

"అవును, దేవుడే నిర్ణయిస్తాడు" అని మరికొంతసేపు గిలగిల—

"అవునులెండి, మీరడిగిన వివ్వకపోతే చేసుకోనే వారే కారుగదా! ఎవరిస్తే వారే మీకు కావాలి."

"ఛా! పోనీ అలాగే ఒకవేళ అయిందనుకో. అప్పుడు నువ్వు మాత్రం ఏంచేస్తావు? అలాగే వుండిపోతావా?"

"అంతవరకూ వుంటే కదూ!"

"అంటే-"

"ఏదో లెండి! అలాటి మాటలిప్పుడెందుకు ?" అంటూ తుళుక్కుపడింది.

"ఏం?" అని అడిగేను.

"మీ అమ్మవచ్చేరనుకున్నా చప్పుడయితే!" అనిఅంది.

"ఓస్! ఎందు కింత భయం? ఏ చప్పుడూ అవందే."

"మీ అమ్మవస్తే ఎలా... వద్దు... వెళ్ళిపొండి... బావుండదు."

"యింకా రాదులే, ఫరవా లేదు!" అంటూనే కమలని యింకా దగ్గరికి తీసుకున్నాను.

మళ్లీ తలుపు చప్పుడయింది—

కమల కంగారులో "ఎవరూ?" అని అడిగింది.

"నేనమ్మా! అమ్మగోరు నేరూ?" అంటూ బంగారి అవతలనుండి అరిచింది.

"అదెందుకు పొమ్మను!" అన్నాను.

"అమ్మయ్యో! లేదండి. యిల్లుకడగడానికి వచ్చింది!"

"అన్నీ యిప్పుడే ముంచుకొస్తాయి? యిప్పుడేం కొంప మునిగిపోయింది. రేపు రమ్మను."

"మీా అమ్మ మరీ మరీ చెప్పేరు. వస్తే కడిగించమని. రేపు పండుగ కదూ! అది మీా అమ్మతో చెబితే-"

"చచ్చాం. మహూర్తం ఏంవీ బాగులేనట్టుంది. అయితే ఏం చెయ్యడం?"

"మీా రలా పెరట్లోంచి వెళ్ళిపొండి. ఏం చేస్తాం? యింకా వుంటే బావుండదు" అని భుజంతట్టి చెప్పింది.

"అది కాదు- ఆ చీడీ వీధి సావిడికడిగి పొమ్మను. అంతా కడిగిందని చెప్పొచ్చు వేగిరం రా!"

"అయితే మీారు వెళ్ళరూ?"

"అహాఁ! యిక్కడే వుంటా భయంలేదు. వెళ్ళి పారిపో వడం దేనికి? నే నేం దొంగనా? మా అమ్మ లేకపోతే ఇంటికి నేను రానా? రాకూడదని రాసివుందా? ఏదోపని వుండి వచ్చేం! అంతే—"

"అనుమాన పడరూ?"

"అక్కర్లే, వెళ్ళు—"

"వద్దండి. తెలిసిపోతుంది! నా మాట వినండి, యింకె లాగూ మీా అమ్మ వచ్చేస్తారు!" అంది.

"వెళుదూ చెబుతాను" అని నే నన్నమీాదట కమల

మాటాడకండా వెళ్ళి తలుపు తీసింది. వాళ్ళ మాటలు వింటూానే వున్నాను.

"అమ్మా! చాల్చి ఏదమ్మా నీరు తోడుకోవాలి" అని బంగారి అడిగింది.

"అన్న! అది యిందాకల తోడుతూంటే నూతులో పడిపోయిందే. ఎలాగ?" అని అంది.

"గేలం ఎక్కడన్నా వుంటే తేరాదూ?" అని తిరిగి అంది.

"ఈ యిల్లీ కాడెక్కడా నేదమ్మా! ఎక్కడో ఎతికి తేవాల. యింత బేగి అవుద్దా!" అని అంది దాని ధర్మమాఅని గేలంకోసం పరుగెట్టక. "ఆ గోలెంలో నీళ్ళు ఎంతవరకు వస్తే అంతవరకూ కడిగి వెళ్ళిపో" అని చెప్పింది! ఎంతపని చేసింది! ఒక్క ముక్కలో యిదంతా తప్పించి ఆఖర్ని వదిలేసింది, ఏదో కారణం చెప్పి దాన్ని దారిబెడితే ఎంత బావుండేది? ఏ నిమిషాన్ని ఎవరు వస్తారో? అంతలో మా అమ్మ వస్తుందో ఏంటో అని దిగులుతోనే వున్నాను.

ఒక అరఘంట పోయాక కమల వచ్చింది.

"ఇహ అలికిరి చెయ్యొచ్చు పిల్లిని తోలేసేను! పాపం, వూపిరయినా గట్టిగా తియ్యకండా కూర్చున్నారు!" అంది చమత్కారంగాను.

"ఎర దొరికింతేనే అలికిరి చేస్తాను! నేనే దొంగ ననుకుంటే నాకన్నా దొంగవయిపోయేవే?" అని అడిగేను.

"ఏం నేనేం దొంగపని చేశానిప్పుడు?"

"నేనంతా వింటూనే వున్నాను. నువ్వు దాంలో అబద్ధం చెప్పలేదూ?"

"ఏఁవని చెప్పేనో?"

"ఏమో అమ్మవస్తే తెలిసిపోదూ! ఏఁవని తప్పుకుంటావో చూడనా? బాల్చీ అక్కడే వుంటే-దానిదగ్గర చెప్పేసి నట్టేనా?"

"నేను నిజఁవే చెప్పేను. నాకేం భయం?" అంది ధీమాగా.

"అదేఁవిటి యిప్పుడిప్పుడు నేను చూశాను, నూతిదగ్గర చేదని. యింతలో ఎవరు పడేశారు? యిదంతా నాటకం లా వుంది. మాయలుకూడా వచ్చునన్న మాట!" అన్నాను ఆశ్చర్యంగా.

"లేదండీ! బంగారితో అలా చెప్పిన తర్వాత అది వెళ్ళగానే నేనే కోరుండి బాల్చీని నూతులో ఎత్తేశాను. లేక పోతే ఏమంటారో అని" అని తలవంచుకొని సిగ్గుతో చిన్న బోయినట్టుంది.

నాకు నవ్వొచ్చింది. మొత్తంమీద మంచి వుపాయమే తోచింది. ఒక తప్పుకి మరో పొరపాటు కాని- పనికొచ్చిన పొరపాట్లయితే ఎన్ని అయినా బాధ లేదులే!" అన్నాను.

"మీనుంచే కదూ?" అంది.

"అబ్బ! ఏంత్యాగం? స్వలాభం ఏఁవీ లేదు కదూ!" అని అంటూ దగ్గరగా తీసుకున్నా.

"ఏం, నీ కిష్టంలేదూ?" అని అడుగుతూ అసింటా అసింటా జరిగిపోతున్నా కమలని పట్టుకున్నాను.

ఒకమారు మాటాడకండా నా మొహం చూసి తల దించుకొని నా అరిపాదం వేళ్ళతో రాస్తూంది. ఆమెని యింకా దగ్గరగా తీసుకున్నాను.

"నీ కెందుకు ఆ భయం ?" అన్నాను.

"అంతవరకూ తొందరెందుకూ?" అని అడిగింది.

"ఎంతవరకూ ?"

"మీాకు తెలియనట్టు !"

"ఓ అదా ! కార్యం కదూ!"

"ఔ" నన్నట్టు తలవూపి నావేపు ఒక్కసారి అదోలా చూసింది,

"అంత యిదయితే వద్దని ఎందుకన్నారు ?" అంది.

"తొందరేం?" అన్నాను.

"అయితే అంతవరకూ నావూసు ఎందుకెత్తుతారు? తొందరేం?" అని ఎదురుప్రశ్న వేసింది.

"అబ్బా! చెడ్డచిక్కే" అని అనేశాను. జవాబు చెప్ప లేక.

"అవును. యిలా దొంగతనంగా భయపడుతూ ఏమిటి?" అంది.

"ఇదొకరకం ఆనందం అవునా! ఆతర్వాత వస్తుందా"

"అవుననుకోండి గాని నాకేమిటో అలా బాగుండడం లేదు."

"పిచ్చిదానా! చదువు పూర్తికాకండా ఎందుకని నావూహా. అంతేకానీ, అయినా యిప్పుడేం తక్కువ మనకి?" అన్నాడు సముదాయిస్తూ.

కమల అది వినగానే ఒళ్లోంచి పారిపోబోయింది, ఆమె పైటకొంగు పట్టుకులాగేశాను. కమల ఆగిపోయింది వెనకాలే వున్న మంచానికి ఆని తలగడా అడ్డం పెట్టుకొని చూస్తూంది.

మెల్లిగా ఆమె బుజాలు పట్టుకున్నాను. కమల ముఖం ఆవేశంతో అనేక భావాలతో నిండిపోయి వుంది. బుగ్గలు కందిపోయాయి, కళ్ళల్లో అనేక సజ్జంలు కనిపిస్తున్నాయి. ఆ ఎర్రటి పెదిమెలమీద అమృతం ప్రసవిస్తూంది.

ఆ చక్కని అధరాలని, బుగ్గలని, తొలిసారి రుచి చూశాను... దానికి చిహ్నంగా ఆమె బుగ్గలమీద కంది పోయింది; ఆమె ఎన్నోసార్లు తుడుచుకుంది గాని-ఆమచ్చ మాత్రం పోలేదు.

ఇంతలోనే—

"కమలా! అన్నపిలుపు వినిపించింది.

ఇద్దరం మాట్లాడే స్థితిలోలేం- కాని- కమల తుమ్మెద వాలి ఎగిరి పోయిన తర్వాత అటూ యిటూ వూగే పుష్పంలా చంచలంగా వుంది.

మళ్ళీ—

"కమలా తలుపు తియ్యి!" అని కేక వినిపించింది. అది మా అమ్మ గొంతుకే—సందేహంలేదు!

ఇహ చూడండి మా పని దాగట్లో పడ్డ వెలంకాయ లాగయింది!